తెలంగాణ పోరాటంలో
ఐలమ్మ వీరత్వం మరువలేనిది

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

వంగూరు, జూలై 28 : తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాటం మరువలేనిదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పోల్కంపల్లిలో గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఉప్పల వెంకటేశ్‌తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఆనాడు తెలంగాణలో రజాకార్లకు ఎదురొడ్డి పోరాడి ఎంతో మందికి స్ఫూర్తిగా చాకలి ఐలమ్మ నిలిచారన్నారు. రజాకార్ల ఆగడాలను అడ్డుకోవడంతో పాటు ఎంతో మంది భూములను వారి కబంధ హస్తాల నుంచి విముక్తి గావించిన ఐలమ్మ గారి విగ్రహాన్ని ఆవిష్కరించే భాగ్యం కలుగడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో రజక, గౌడ భవనాలకు నిధులు మంజూరు చేయడంతోపాటు మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. గ్రామానికి చెందిన విగ్రహ దాత భోగరాజు శ్రీనివాసులుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే వంశీకృష్ణ, బాలాజీసింగ్, సత్యం, ఉప్పల వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ గాయకులు రేలారే గంగా, సందీప్ పాటలతో అలరించారు. కార్యక్రమం లో రజక సంఘం జిల్లా నేత సురేందర్, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నేతలు కృష్ణారెడ్డి, పాండురంగారెడ్డి, అర్జున్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నేతలు ఆశయ్య, ఏపీ మల్లయ్య, శ్రీనివాస్, నాయకులు, రజకులు ఉన్నారు.

వామ్మో కుక్కలు..!

- భయాందోళనకు గురిచేస్తున్న వీధి కుక్కలు

సంజయ్‌నగర్ శ్రీపురం రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు

ప్రగతి దవాఖాన రోడ్డులో కుక్కల స్వైర విహారం

నాగర్‌కర్నూల్, జూలై 28 : జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు ప్రజల్ని భయాందోళకు గురిచేస్తున్నాయి. పట్టణంలో ఏ వీధిలో చూసినా మూడు నుంచి పది కుక్కల గుంపులుగా కుక్కలు సంచరిస్తుండడంతో పిల్లలను బయట పంపాలన్నా భయపడుతున్నారు. వారం రోజులుగా పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు గుంపులను చూసి పెద్దలు సైతం భయాందోళన చెందుతున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలిసినా, పలువురు ఫిర్యాదు చేసినా పట్టనట్లుగా ఉంటున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వీధికుక్కల గురించి చర్యలు తీసుకోకుండా పేపర్ ప్రకటనలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మరికొందరు కాలినడకన తిరిగే వారు, కార్లలో తిరిగే వారికి కుక్కల భయం ఏం తెలుస్తుందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో భయాందోళనకు గురిచేస్తున్న కుక్కలను అరణ్య ప్రాంతాల్లో వదిలిపెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం పట్టణంలో సంచరిస్తున్న కుక్కల గుంపులను పలువురు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అధికారులపై మండిపడ్డారు.

సీఎం రేవంత్‌కు వినతి

కల్వకుర్తిరూరల్, జూలై 28 : కల్వకుర్తిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డికి కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం వినతిపత్రాన్ని అందజేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.60కోట్లు, విద్యుత్ డివిజన్ కార్యాలయ ఏర్పాటు, ఉద్యానవన పంటలకు పెద్దపీట వేయాలని కల్వకుర్తి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు నూతన భవనాన్ని నిర్మింపజేయాలని, పట్టణంలోని నిర్మించబడి ఉన్న డబుల్‌బెడ్రూం ఇండ్ల వద్ద అన్ని వసతులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీఎం రేవంత్‌కు వినతిపత్రం ద్వారా కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల వివరాలు తెలపాలి : డీఈవో

నాగర్‌కర్నూల్, జూలై 28 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు(ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్) పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను తెలియపరిచి, పరీక్షల ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు అయితే రూ.120, ప్రైవేట్ పాఠశాలలు అయితే రూ.150 చెల్లించాలన్నారు. 6,7,8 తరగతులకు కేవలం ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే రూ.120 చొప్పున చెల్లించాలని సూచించారు.

సమస్యలను పరిష్కరించాలి

అచ్చంపేటరూరల్, జూలై 28 : గిరిజనుల పోడు భూములు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మన్నెవారిపల్లి ఎస్ఎల్‌బీసీ ముంపు బాధితులు, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎం గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 8న నియోజకవర్గ స్థాయి భూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు తెచ్చారు..వదిలేశారు

- అధికారుల నిర్లక్ష్యం

రోడ్డుకు ఇరువైపులా నాటకుండా వదిలేసిన మొక్కలు

చారకొండ, జూలై 28: గ్రామాల్లో పచ్చదనంగా మార్చేందేకు గత ప్రభుత్వం హాయంలో హరితహారంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. మండలంలోని సిరుసనగండ్ల పరిధిలోని అయోధ్యనగర్ సీతారామచంద్రస్వామి ఆలయంకు వెళ్లే రహదారి ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతలను తీయకుండానే మొక్కలు వేసి నాటకుండా వదిలేశారు. రోడ్డు ఇరువైపులా వదిలేసిన కొన్ని మొక్కలు వాడిపోతున్నాయి. నర్సరీలో మొక్కలు పెంచేందుకు లక్షల్లో వెచ్చించి పెంచిన మొక్కలు అబాసుపాలవుతున్నాయి. మొక్కలు నాటి సంరక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మొక్కలు నాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి రూరల్, జూలై 28 : కల్వకుర్తి పట్టణంలోని పరిణయం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జెడ్పీహెచ్ఎస్ 2000-01 పదో సంవత్సరపు విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు రఘునందన్, ఏపీ మల్లయ్య, యాదయ్యగౌడ్, సుగుణ, ఆంజనేయులు, భాస్కర్, ప్రభాకర్‌రెడ్డి, దశరథ్ సింగ్‌ను శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు తమ మధ్య అనుబంధాలను ఆత్మీయతలను పెంపొందిస్తాయని ఉపాధ్యాయులన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఉండడంతో వారిని అభినందించారు.

చౌకధర దుకాణాల్లో
నిత్యావసర సరుకులు అందించాలి

నాగర్‌కర్నూల్, జూలై 28 : ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని చౌకధర దుకాణాల ద్వారా ప్రభుత్వం ప్రతి పేదవానికి నిత్యావసర సరుకులు అందించాలని సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్‌శర్మ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ప్రారంభించిన రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, చింతపండు, కారం, ఉప్పు, గోదుమలు వంటి 9 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. దీంతో పేద ప్రజలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలు ఉన్న సరుకులు కొనలేక పస్తులు ఉండే పరిస్థితులు దాపురించాయన్నారు. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో పామాయిల్, కందిపంప్పు, గోదుమలు వంటివి ఇవ్వకుండా నిలుపుదల చేశారని, దీంతో పేదప్రజలు అర్ధాకలితో జీవిస్తున్నారన్నారు. నెలకు ఒకసారి వచ్చే రేషన్ సరుకులపై ఆధారపడుతున్న పేద ప్రజలు అన్ని రకాల సరుకులు అందించకపోవడంతో, బహిరంగ మార్కెట్లలో కొనలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చౌకధర దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేసి పేద ప్రజల ఆకలి తీర్చాలని కోరారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

డిపో ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

అచ్చంపేటటౌన్, జూలై 28 : అచ్చంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించినట్ల డిపో మేనేజర్ పీఎండీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం అచ్చంపేట డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి 80 మొక్కలను నాటామని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలను వాటిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కల్వకుర్తి రూరల్, జూలై 28 : పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఎల్లయ్య ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా మాసూంబాబా ఉర్సు

- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- మూడు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు

ముస్తాబైన మాసూంబాబా దర్గా

పెంట్లవెల్లి, జూలై 28 : మండలంలోని జటప్రోల్‌లో కులామతాలకు అతీతంగా జరుగుతున్న మాసూంబాబా దర్గా ఉర్సు ఆదివారం రాత్రి నుంచి గంధోత్సవంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూల ల నుంచి భక్తులు తరలివచ్చి దర్గాను దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎస్సై రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పని చేసిన వారిపై చిన్నచూపు తగదు

- విగ్రహావిష్కరణలో కాంగ్రెస్ నాయకుల లొల్లి
- పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులట

పోలీసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోతీలాల్

వెల్దండ, జూలై 28 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కష్ట నష్టాలకు, చెమటోడ్చి, నిత్యం అరెస్ట్‌లతో అనేక ఇబ్బందులు పడి పార్టీని నిలబెట్టిన కాంగ్రెస్ నాయకులను కాదని దొంగలు, వ్యభిచారులను అందలం ఎక్కియడం ఎంతవరకు సబబు అని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోతీలాల్, తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తమను కాదని పార్టీ కోసం ఎప్పుడు పని చేయని వారిని అందలం ఎక్కించడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడానికి వెళ్తున్న కాంగ్రెస్ వెల్దండ మండల అధ్యక్షుడిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువరి మధ్య తోపులాట చోటుచేసుకున్నది. పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది.

అదనపు ఎస్పీకి సన్మానం

ప్రతాప్‌కుమార్‌ను సన్మానిస్తున్న మిత్ర మండలి సభ్యులు

అచ్చంపేటరూరల్, జూలై 28 : నల్లమల ప్రాంతానికి చెందిన బల్మూరు ప్రతాప్‌కుమార్ హైదరాబాద్ ఇంటలీజెన్స్‌లో ఏసీపీగా పనిచేస్తు అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం స్వగ్రామం అచ్చంపేటకు విచ్చేసిన సందర్భంగా పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో చిన్ననాటి మిత్రులు ప్రతాప్‌కుమార్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మిత్ర మండలి అధ్యక్షుడు మండికారి బాలాజీ, పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు సతీశ్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, కాశీలింగం, శేఖర్ పాల్గొన్నారు.

కొండూరులో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

కొండూరులో సమస్యలపై సర్వే నిర్వహిస్తున్న నాయకులు

పెంట్లవెల్లి, జూలై 28 : మండలంలోని కొండూరులో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కొండూరులో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 11కేవీ విద్యుత్ లైన్ ఇండ్లపై నుంచే తీసుకుపోయారని ఆ విద్యుత్ లైన్‌ను ఊరి బయటి నుంచి తీసుకెళ్లాలన్నారు. తుంకుంట వాగు నుంచి కొండూరు ఊర చెరువు వరకు కాలువ నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుంకుంట తండా వద్ద బీమా కాలువ తెగిపోయి నీళ్లు రావడం లేదని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు హనుమంతు, ఎల్లగౌడ్, దేవమ్మ, కురుమయ్య, జయమ్మ, మద్దిలేట్టి ఉన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్

విద్యార్థులతో మాట్లాడుతున్న సయ్యద్

అమ్రాబాద్, జూలై 28 : వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్ననూర్‌లో ఉన్న ఎస్టీ, ఆశ్రమ బాలికల, ఎస్టీ బాలుర పీటీజీ వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకా రం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత భవనాలు లేని వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శివ, సతీశ్, రాజు, ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, **MQHD NAJEEB PASHA**, S/o: **AHMED MOHIUDDIN**, R/o: 1-8-16/3A, Khaleel Chowk, T.D Gutta, Mahabub Nagar - 509001, Changed My Name as **MOHAMMED NAJEEB PASHA**.
NT- MBNR

CHANGE OF NAME
I, **ROOPADEVI** W/o **NARAYANDAS SUPARNASA HARI KRISHNA**, R/o : 14-3-82/A/1, New Balaji Nagar, Mahabub Nagar - 509001, Changed My Name as **NARAYANDAS ROOPADEVI.**
NT- MBNR

డాక్యుమెంట్ పోయినది
వుడుతల భాస్కర్ తండ్రి లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం. 1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్ నగర్ జిల్లా గారి సర్వే నెం. 565/ఈ విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (ప్రాస్ బుక్ నం. టీ01020011634, ఖాతా నెం.2663) పత్రాలు కలిగి ఉన్న అగ్రికల్చర్ ఆస్తికి సంపూర్ణ యజమాని, సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయునది ఏమనగా. సర్వే నెం.565/ఈ, విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (ప్రాస్ బుక్ నం. టీ01020011634, ఖాతా నెం.2663) ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం.1830/2021 వారం రోజుల క్రితం పోయినది. కావున ఎవరికైన దొరికినచో అట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ కాపీలను ఈ క్రింది అడ్రస్‌కు పంపగలరు.
వుడుతల భాస్కర్ తండ్రి **లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం.1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్‌నగర్ జిల్లా గారి సెల్ నెం. 9346794570.**

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

హక్కులను సాధించుకుందాం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

లింగాల, జూలై 28 : ఎరుకల కులస్తులు ఏకమై హక్కులను సాధించుకుందామని ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు కేటీ తిరుపతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో ఉద్యోగులు, గ్రామపెద్దల సమక్ష్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఏకలవ్య జాతి బిడ్డలు ఏకథాటిపై లేకపోవడంతో హక్కులను కోల్పోయి అగ్రవర్ణాలకు బానీసలుగా బతుకుతున్నామన్నారు. త్వరలో గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా పంచాయతీ ఎన్నికల్లో యువకులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటయ్య, పర్వతాలు, పరమేశ్, నాగేశ్వర్, పెంటయ్య, రాజు, మల్లేశ్, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

2వ క్యాబినెట్ మీటింగ్‌లో అచ్చంపేట క్లబ్ సభ్యులు

మీటింగ్‌లో పాల్గొన్న అచ్చంపేట సభ్యులు

అచ్చంపేటటౌన్, జూలై 28 : మంత్రాలయంలో ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ గవర్నర్ జగదీశ్ గుప్తా ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ వీ108ఏ 2వ క్యాబినెట్ మీటింగ్ అట్టహాసంగా నిర్వహించినట్లు అచ్చంపేట వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పోల సాయిరాం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ సెక్రటరీ నాగభూషణం గుప్తా హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నిరుపేదలకు సేవా కార్యక్రమాల ను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వినోద్‌కుమార్, రామకృష్ణ, శ్రీను, కిశోర్, శ్రీకాంత్, రంజిత్, అల్లాజి, సురేందర్, రాజు పాల్గొన్నారు.

శరవేగంగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం

అచ్చంపేటటౌన్, జూలై 28 : పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆలయాధ్యక్షుడు కపిలవాయి మహేశ్ చారి అన్నారు. ఆదివారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణ పనులు దాతలు, రాజకీయ నాయకుల సహకారంతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి నర్సింహారావు, కేతేపల్లి వెంకటేశ్, రమేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో బోనాల ఊరేగింపులో మహిళలు

ఘనంగా కోట మైసమ్మ ఉత్సవాలు

తిమ్మాజిపేట, జూలై 28 : మండల కేంద్రంలో కోట మైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బోనాలు ఎత్తుకొని మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళల బొడ్డెమ్మలు, యువకుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.